నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | ఫిబ్రవరి 22, 2024 | www.navatelangana.com

జిల్లా పరిషత్ చైర్మన్‌ని కలిసిన సీఈవో, ఎంపీడీవోలు


జడ్పీ చైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఈవో

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారము జరిగిన బదిలీల్లో భాగంగా కామారెడ్డికి కేటాయించబడిన జిల్లా పరిషత్ సీఈవో, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్ పర్సన్ జిల్లా పరిషత్ శోభా రాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్ నాయక్, కామారెడ్డి ఎంపీడీవో నాగవర్ధన్, బిక్కనూర్ ఎంపీడీవో సంతోష్ రెడ్డి , మాచారెడ్డి ఎంపీడీవో గోపి, సతీష్ నగర్ ఎంపీడీవో సంతోష్ కుమార్ , రాజంపేట ఎంపీడీవో రాజేశం, బీబీపేట్ ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ లు పాల్గొన్నారు.

గోదాం ప్రారంభించిన జుక్కల్ ఎమ్మెల్యే


గోదాం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బిచ్కుంద

మండల కేంద్రంలోని రైతు సేవ సహకార సంఘంలో 36 లక్షల నిధులతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల నూతనంగా నిర్మించిన గోదామును జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు బుధవారం ప్రారంభించారు. నూతన గోదాం చుట్టూరా సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని చైర్మన్ శ్రీహరి బాలాజీ విన్నవించగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సి సి రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అశోక్ పటేల్, ఎన్ డి సి సి డైరెక్టర్ రామ్ పటేల్, సాయి రెడ్డి, ఎంపిటిసి సురేష్, ఎండి క్రాంతి కిరణ్, పిట్లం క్లస్టర్ అధికారి మురళీధర్ గౌడ్, లక్ష్మీనారాయణ, మాజీ చైర్మన్ ధర్పల్లి గంగాధర్, వెంకట్ రెడ్డి, విట్టల్ రెడ్డి, మున్నూరు నాగనాథ్, అస్పత్వార్ వినోద్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అప్పుల ఊబి..



- పెండింగ్ బిల్లులు చెల్లించాలని తాజా మాజీ సర్పంచ్‌ల ఆవేదన
- నేడు చలో హైదరాబాద్

నవతెలంగాణ-ఆర్మూర్

దేశానికి పట్టుకొమ్మలు అంటూ గ్రామ పాలనలో గ్రామ అభివృద్ధిలో ముందుండి అప్పులు చేసి అభివృద్ధిలో పాటుపడ్డ తమకు బిల్లులు మంజూరు చేయడం లేదని తాజా మాజీ సర్పంచులు ఆందోళన చెందుతున్నారు. బకాయిలు బిల్లులు చెల్లించాలంటూ నేడు(గురువారం) చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చారు. వివిధ గ్రామ పంచాయతీలకు గత 17 నెలల నుండి ఎస్ఎఫ్‌సి నిధులు ప్రతి గ్రామానికి సుమారుగా 5 లక్షల నుండి 40 లక్షల వరకు సైతం పెండింగ్ బిల్లులు రావాల్సి ఉందని పలువురు మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు చెల్లిస్తుందనే నమ్మకంతో అప్పులు చేసి పనులు చేపడితే తమకు తీవ్ర ఇక్కట్లకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.

జిల్లా వ్యాప్తంగా 530 గ్రామపంచాయతీలు ఉన్నాయి. జనాభా ప్రతిపాదికన ప్రతినెల స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి పంచాయతీ ఖాతాల్లో జామ అవుతాయి. అదేవిధంగా ఆర్థిక సంఘం నిధులు కూడా సుమారు అంతే మొత్తంలో వస్తాయి. ఈ నిధులతో జీపీల్లో అభివృద్ధి పనులు చేపడుతూ కార్మికుల వేతనాలు చెల్లించేవారు. జిల్లా వ్యాప్తంగా సుమారుగా 80 కోట్లకు పైగా నిధులు రావాల్సి ఉంది. వివిధ గ్రామాలలో సర్పంచులు అప్పులు తీసుకొచ్చి సగం వరకు వేతనాలు తప్పనిసరి పరిస్థితుల్లో చెల్లిస్తూ వచ్చినట్టు సమాచారం.

అప్పులు తీర్చేమార్గం లేక ఆత్మహత్యాయత్నం

సుమారుగా కోటి వరకు బిల్లులు రావాల్సి ఉందని నందిపేట్ సర్పంచ్ సాంబారు వాణి దంపతులు గతంలో కలెక్టరేట్‌లో పెట్రోలు పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డ ఘటన తీవ్ర సంచలనం రేపింది. అదే విధంగా రూ.19 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందని సస్పెండ్ అయినా కల్లెడ సర్పంచ్ లావణ్య ఆత్మహత్యాయత్నం చేసుకున్న విషయం తెలిసిందే. జిల్లాలోని చాలామంది సర్పంచులది ఇదే పరిస్థితి. గ్రామ పంచాయతీల్లో నిధుల కంటే బిల్లులే అధికంగా రావాల్సి ఉందని పలువురు సర్పంచులు వాపోతున్నారు. నెలల తరబడి ట్రెజరీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా చెక్కులకు మోక్షం కలగడం లేదు. ఇప్పటికైనా త్వరగా నిధులు బిల్లులు విడుదల అయ్యేలా ప్రభుత్వాలు చొరవ చూపాలని మాజీ సర్పంచులు పలుమార్లు బిఆర్ఎస్ ప్రభుత్వానికి విన్నవించినారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి మాజీ సర్పంచులు పార్టీని వీడలేక.. హస్తం గూటికి చేరలేక లోలోన మదన పడుతున్నారు.

బిల్లులను విడుదల చేసి ఆదుకోవాలి

గ్రామ అభివృద్ధిలో మా పాత్ర ఎంతో కీలకమైంది. పనులు చేస్తేనే మాకు గ్రామాల్లో తలెత్తుకొని తిరుగుతామని అప్పులు చేసి మరి అభివృద్ధి పనులు చేపట్టాం. కానీ బిల్లులు పెండింగ్‌లో ఉంచారు. బిల్లుల విడుదలకు నేటి చలో హైదరాబాదును విజయవంతం చేద్దాం.

ఒక గ్రామ మాజీ సర్పంచ్. ఆర్మూర్ మండలం.

అమాంతం పెరిగిన కంది ధర

- దిగుబడి తగ్గడమే కారణం
- క్వింటా 11 వేల పైనే..

నవతెలంగాణ-జుక్కల్


విక్రయానికి సిద్ధంగా ఉన్న కందులు

కంది పంట ధర ఆమాంతం పెరుగుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో కంది పంట సుమారుగా ఏడు వేల ఎకరాలలో సాగు చేస్తున్నారు. ఎన్నొ ఒడిదుడుకులను ఎదుర్కొని ఎకరాకు సుమారుగా ఇరువై వేల పెట్టుబడి పెట్టి పంటను సాగు చేశారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌కు పదకొండు వేలకు పైగా ధరతో ప్రయివేట్ వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు. దిగుబడి తగ్గడంతో డిమాండ్ పెరిగి ధర పెరుగుతోంది. దిగుబడి తగ్గినా మంచి ధర వస్తుండటంతో రైతన్న కళ్లలో సంతోషం కనిపిస్తుంద. కందులకు భారీగా ధర పదివేలు ఆపై పలకడం మొదటిసారి కావడం వలన రైతులు సంతోషంలో ఉన్నారు. ఈ ఏడు పంట పండిన మొదట్లో అమ్ముకున్న వారు తగిన రేటు వచ్చినప్పుడికి, అప్పుడప్పుడు హెచ్చుతగ్గులు అవుతున్నాయి. దీంతో రైతులకు అనుమానాలు రేకెత్తి ఎప్పుడు పెరుగుతుందో, తగ్గుతుందో అందోళనలో అమ్మడమే బెటర్ అని అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

ఈ సారీ ఖర్చులు ఎక్కువే..

కంది పంటకు సాగురైతుకు ఖర్చులు విపరితంగా పెరిగినాయి. దీనికి తోడు పంట గిగుబడి తగ్గింది. ధర వస్తుండటంతో మేలు జరిగినట్టు అయింది. ఇప్పటికే ఎకరాకు ఇరవై నుంచి 30 వేల రూపాయలు ఖర్చుపెట్టినట్టు రైతులు తెలిపారు.

ఇక సామాన్యులకు కష్టమే..

కందుల ధర పెరగడంతో ఒక వైపు రైతులు హర్షం వ్యక్తం చేస్తుండగా.. సామాన్య మధ్య తరగతి వారు ఆందోళన చెందే పరిస్థితి నెలకొంది. అప్పుచేసి పప్పు కూడు అనే చందంగా పేద, మధ్య తరగతి వారికి అందని ద్రాక్షగా మారింది. ప్రస్తుతం దిగుబడి తగ్గి ధర పెరగడంతో బహిరంగ మార్కెట్‌లో దాని ధర మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో కంది పప్పు ఇక తినడం కష్ట సాధ్యమవుతదేమోనని మధ్యతరగతి ప్రజలు కుటుంబాల వారు అందోళన చెందుతున్నారు.

జీవనోపాధి కల్పించి

పేద మహిళలను లక్షాధికారులను చేయాలి


మాట్లాడుతున్న డీపీఎం రమేశ్‌బాబు

నవతెలంగాణ-పిట్లం

పేద మహిళలకు వివిధ రకాల జీవనోపాధి కల్పించి లక్షాధికారులను చేయాలని డిపిఎం రమేష్ బాబు, ఏపిఎం జగదీష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ శక్తి భవనములో లక్‌పతిదిదిపై పిట్లం , పెద్ద కొడప్ గల్ మండలాల వివోఏ లకు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకులు రమేష్ బాబు , జగదీష్ లు మాట్లాడుతూ ఇందిరా క్రాంతి పథకంలో వివో ఏ లుగా కొనసాగుతున్న సిబ్బంది కృత నిశ్చయంతో మహిళా సంఘాల బలోపేతానికి నిరంతరం కృషి చేయాలన్నారు. మహిళలు ఒకే పనిపై ఆధారపడి జీవనం సాగించకుండా , వివిధ రకాల పనులను ప్రోత్సహిస్తూ , మహిళా సమైక్య సంఘ సభ్యుల అభివృద్ధికి గాను ప్రతి సంవత్సరం వారి ఆదాయము లక్ష కంటే మించి పొందాడానికి వివిధ రకాల జీవనోపాధి కల్పించి వారి ఆదాయాన్ని పెంపొందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏపిఎం శిరీష, రెండు మండలాల సిసి, వివోఏలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రంలో మంగళవారం రాత్రి బిచ్కుంద ఎస్సై మోహన్ రెడ్డి తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్, త్రిబుల్ రైడింగ్, వాహనదారుల నెంబర్ ప్లేట్లు వాహనాల ధ్రువపత్రాలు, లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలను పరిశీలించారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

బస్సులు ఎక్కేటప్పుడు దిగేటప్పుడు తమ సామాన్లను జాగ్రత్తగా చూసుకోవాలని ముఖ్యంగా చైన్స్ స్నాచింగ్ ప్రమాదాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మోహన్ రెడ్డి మహిళలకు సూచించారు. ప్రత్యేకంగా అంగడి రోజు బస్టాండ్ తో పాటు రద్దీ ప్రాంతాల్లో ఐడి పార్టీని ఏర్పాటు చేసి రక్షణ కల్పిస్తామని ఎవరికైనా అపరిచిత వ్యక్తుల నుండి ప్రమాదం అనిపిస్తే 100కు డయల్ చేయాలని లేదా పోలీసులకు సమాచారం అందించాలని వెంటనే మహిళలకు రక్షణ కల్పించి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

బకాయి వేతనాల విడుదలపట్ల హర్షం


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పలువురు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని విఠలేశ్వర మందిర్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ధూప దీప నైవేద్య అర్చకులు బుధవారం పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా ధూప దీప నైవేద్య అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షులు అంజనప్ప మాట్లాడుతూ ధూప దీప నైవేద్య అర్చకులకు పాత వేతనం కొత్త వేతనం అందరికీ విడుదల చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మద్నూర్ మండల అధ్యక్షులు వెంకట్ మహారాజ్, కార్యదర్శి గోపాల్ చారి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తా

- 1.20 లక్షల ఎకరాలకు సాగునీరందించడమే లక్ష్యం
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతరావు

నవతెలంగాణ-బిచ్కుంద


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మున్నూరుకాపులు

జుక్కల్ నియోజకవర్గంలో సాగు నీటి ప్రాజెక్టుల ద్వారా కేవలం 13,000 ఎకరాలకు మాత్రమే సాగు నీరు అందుతున్నదని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు తెలిపారు. లెండి, నాగమడుగు కౌలాస్ నాలా సాగునీటి ప్రాజెక్టులు గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురయ్యాయ అని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేసి నియోజకవర్గ వ్యాప్తంగా 1,20,000 ఎకరాలకు సాగు నీరు అందించడమే తన లక్ష్యమని తెలిపారు. మున్నూరు కాపుసంఘం సభ్యులు ఎమ్మెల్యేకు సన్మాన కార్యక్రమం స్థానికం కులసంఘం భవనంలో బుధవారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ బిచ్కుంద మండల కేంద్రంలో రోడ్డు సెంటర్ లైటింగ్ పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. బిచ్కుంద గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా చేసేందుకు కృషి చేస్తానన్నారు.

మున్నూరుకాపులు అన్ని రంగాల్లో ఎదగాలి

కాపు కులస్తులు ముఖ్యంగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని వ్యవసాయ రంగంతో పాటు విద్యా రాజకీయ వ్యాపార అన్ని రంగాల్లో రాణించి ఎదగాలని సూచించారు. రాష్ట్ర రాజకీయాల్లో మున్నూరు కాపుల ప్రాతి నిధ్యం అవసరమని మున్నూరు కాపులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని మున్నూరు కాపులకు ప్రభు త్వం అండగా ఉంటుందని అన్నారు. కళ్యాణ మండపంలో స్థలం సరిపోవటం లేదని రెండు ఎకరల భూమి కేటాయించి నూతన కళ్యాణ మండపం ఏర్పాటుకు కృషి చేయాలని కుల పెద్దలు ఎమ్మెల్యేకు విన్నవించగా.. ప్రస్తుతం ఉన్న కళ్యాణ మండపంలో వంట షెడ్డు ఏర్పాటు కృషి చేస్తానని రెండెకరాల భూమి కేటాయించి నూతన కళ్యాణ మండపం నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మున్నూరు కాపు విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడానికి వెళ్లాలనుకునే మున్నూరు కాపు విద్యార్థులతో పాటు ఇతర విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండలం మున్నూర్ కాపు సంఘం అధ్యక్షులు గడ్డం అరవింద్, సెక్రెటరీ రమణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాల్చార్ శ్రీనివాస్, బిచ్కుంద అధ్యక్షులు బొమ్మల లక్ష్మణ్, ఉపాధ్యక్షులు సాయిని అశోక్, గౌరవ అధ్యక్షులు సోపాన్, నాల్చారాజు, మున్నూరు నాగనాథ్, అస్పత్ వార్ వినోద్, మాగి ప్రదీప్, విట్టల్ రెడ్డి, నౌషా నాయక్, వెంకట్ రెడ్డి, నాయకులు, మున్నూరు కాపు కులస్తులు పాల్గొన్నారు.

పార్టీ మారే ఆలోచనలో బీజేపీ కార్పొరేటర్లు

- కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధం చేసుకుంటున్న 8 మంది..

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

లోక్ సభ ఎన్నికల వేళ.. బిజెపి పార్టీలో లుకలుకలు మొదలయ్యాయి. కేంద్రంలో అధికారంలో ఉన్నా.. అర్బన్‌లో ఎమ్మెల్యే ఉన్నా.. స్థానిక నాయకుల తీరుతో విసుగెత్తిపోతున్నట్లు సమాచారం. దీంతో సుమారు 8 మంది బీజేపీ కార్పొరేట్‌లు పార్టీ మారేందుకు సర్వం సిద్ధం చేసుకున్నట్టు సమాచారం. కార్పొరేటర్‌గా గెలవలేని నాయకులకు పెద్దపెద్ద పోస్టులు ఇవ్వడంతో తమపై పెత్తనం చెలాయిస్తున్నారని వాపోతున్నట్టు వినికిడి. సదరు నాయకుడు ఎమ్మెల్యేకు పూర్తిగా అంటిపెట్టుకొని ఉంటున్నట్టుగానే షాడో ఎమ్మెల్యే గా, ఆయన ప్రవర్తన ఉండడంతో ఆ కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకునేందుకు సిద్ధపడుతున్నట్టు సమాచారం. సుమారు 8 మంది మంచి సమయం చూసి పార్టీ మారనున్నట్టు వినికిడి.

ఒకవైపు లోకసభ ఎన్నికలు ఆసన్నమవుతున్నప్పటికీ నిజామాబాద్ లోకసభ ఎంపీ బిజెపి పార్టీ అభ్యర్థి అయినప్పటికే, ఇప్పటికీ ఆ ఎంపీ పై కూడా పలువురు నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ కార్పొరేటర్‌లు లోకసభ ఎన్నికల సమయం సమీపిస్తున్న వేళ పార్టీ మారడం కాంగ్రెస్‌కు కలిసి వచ్చేలా కనిపిస్తున్నట్టు విశ్లేషణ చేస్తున్నారు. గతంలో బిజెపి పార్టీ నుండి బీఆర్ఎస్‌కు వెళ్లినవారు తిరిగి బిజెపిలోకి వచ్చినప్పటికీ కూడా బిజెపిలో జరుగుతున్న అంతర్గత కలహాలతోనే పలువురు కార్పొరేటర్లు పార్టీ మారాలని సిద్ధం చేసుకుంటున్నట్టు సమాచారం.

నవోదయలో మాతృభాషా దినోత్సవ వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపల్, విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని జవహర్‌లాల్ నవోదయ విద్యాలయంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సత్యవతి మాట్లాడుతూ విద్యార్థులు మాతృభాషలో ప్రావీణ్యం సాధించినప్పుడే విద్యారంగంలో రాణిస్తారని అన్నారు. అలాగే తెలంగాణ ఆదికవి పాల్కురికి సోమనాథుని చిత్రపటాన్ని ఆమె ఆవిష్కరించారు. అలాగే తెలుగులో వైవిధ్యమైన ప్రక్రియలను చేపట్టి ప్రతిభావంతమైన రచనలు చేసిన మహాకవి సోమనాథుడని ఆమె అన్నారు. విద్యాలయ తెలుగు అధ్యాపకులు డాక్టర్ శంకరామంచి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ అభివృద్ధిని సాధించిన దేశాలన్నీ మాతృభాషలోనే విద్యా బోధన కొనసాగిస్తున్నాయన్నారు. అందుకే ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంలో భాగంగా మాతృభాషకు ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. దేశి కవిత ద్వారా తెలుగు భాషకు పట్టం కట్టిన కవి పాల్కూరి అని అన్నారు. శతక ప్రక్రియకు ఆద్యుడు సోమనాథుడని అష్టభాష కోవిదుడని కొనియాడారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా తెలుగు విభాగం నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ బహుమతులు ప్రదానం చేశారు. విద్యాలయ ఆర్ట్ ఉపాధ్యాయులు సయ్యద్ జయావుద్దీన్ గీసిన చిత్రపటం ఆకట్టుకుంది. విద్యాలయ తెలుగు ఉపాధ్యాయులు వివేకానంద నాయుడు వందన సమర్పణతో కార్యక్రమం ముగిసినట్టు ప్రిన్సిపల్ సత్యవతి తెలిపారు.

అర్హులైన ప్రతి యువతా

ఓటరుగా నమోదయ్యేలా చూడాలి

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలో అర్హులైన ప్రతి యువత ఓటరుగా నమోదయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ రాజకీయ పార్టీల ప్రనిధులను కోరారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరములో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ డూప్లికేట్ కార్డులు, ఫోటో సిమిలర్ ఎంట్రీ, మరణించిన ఓటర్ల పేర్లను తొలగించి తుది ఓటరు జాబితాను ఈ నెల 8 న విడుదల చేశామని అన్నారు. ఇప్పటి వరకు వచ్చిన ధరఖాస్తులన్నింటిని పరిష్కారించామన్నారు. పార్లమెంటు ఎన్నిల నామినేషన్ చివరి రోజు వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, బూత్ స్థాయిలో ఏజెంట్లను నియమించుకొని అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కలిగించాలన్నారు. బూత్ స్థాయిలో తుది ఓటరు జాబితాను పరిశీలించి ప్రముఖుల పేర్లు తొలగిపోకుండా చూడాలని, మార్పులు, చేర్పులు, బోగస్ ఓటర్లున్నట్లయితే తెలపాలని, తొలగింపునకు ఫారం-7 ద్వారా దరఖాస్తు చేయాలని సూచించారు. జిల్లాలో 791 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వి వి ప్యాట్ ల ప్రథమ స్థాయి పరిశిలన జరిపామని త్వరలో వీటిపై అధికారులకు శిక్షణ ఇస్తామని అన్నారు.

ఈ సమావేశంలో పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో సరైన వెలుతురు ఉండేలా చూడాలని, ఓటు వేసినట్లు కంట్రోల్ యూనిట్లో బీప్ అనే శబ్దం వస్తుందన్న విషయాన్ని గ్రామీణ ప్రాంతాల ఓటర్లకు తెలిసే విధంగా విస్తృత అవగాహన కలిగించాలని కలెక్టర్‌ను కోరగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి బుధవారం జరిగే సమావేశాలలో నిర్దిష్టమైన సమస్యలు ప్రస్తావిస్తే పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కాసిం అలీ, జూకంటి ప్రభాకర్ రెడ్డి, మదన్ లాల్ జాదవ్, హరిలాల్ నాయక్, మహమ్మద్ జఫ్ఫార్ ఖాన్, అనిల్ కుమార్, నరేందర్, గజం నిరంజన్, ఎన్నికల పర్యవేక్షకులు అనిల్ కుమార్, ఇందిర ప్రియదర్శిని పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగంతో ప్రజలకు సేవచేసే అవకాశం

- జిల్లా పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్
- కొత్త కానిస్టేబుళ్లకు శిక్షణ షురూ

నవతెలంగాణ-బోధన్


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ కల్మేశ్వర్..


9 నెలల పాటు శిక్షణ పొందనున్న ట్రైనీ కానిస్టేబుల్స్

పోలీసు ఉద్యోగాలతోనే సమాజంలోని ప్రజల కు సేవ చేసి అవకాశం కలుగుతుందని నిజామా బాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ అన్నారు. నూతనంగా ఎంపికైన స్వయిపాండరీ క్యాడెటు, ట్రేయిని కానిస్టేబుల్స్‌కు 9 నెలల శిక్షణ నిమిత్తం కరీంనగర్, జగిత్యాల్, ములుగు జిల్లాల నుండి వచ్చిన సివిల్ విభాగానికి చెందిన 195 మంది పోలీస్ అభ్యర్థులతో జానకంపేట్ పోలీస్ శిక్షణ కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో రకరకాల మోసాలను, నేరాలను అరికట్టాలంటే శిక్షణ పొందే సమయంలో సిబ్బంది క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేయాలని అప్పుడే ఇలాంటి నేరాలను అరికట్టడం సాధ్యమవుతుందన్నారు. ఉన్నత చదువులు చదివిన యువకులు ప్రజలకు సేవలు అందించే అవకాశం కలిగిన పోలీసు వృత్తిని ఎంచుకోవడం అభినందనీయమన్నారు. శిక్షణ అనేది ఇంటినిర్మాణానికి పునాదిలాంటిదని, పునాది బాగుంటే ఇంటి నిర్మాణం బాగుటుందని, అందుకే పోలీస్ పై ఎన్నో భాద్యతలు ఉంటాయని అన్ని శాఖలకన్న ఎక్కువ మంది సిబ్బంది పోలీస్ శాఖలో ఉంటారని అన్నారు. అందుకే అందరూ యునిఫాం సర్వీసు ఒకే మాదిరిగా ఆలోచించి సేవలు అందించాలని, అమలు చేసే చట్టం ఒకే మాదిరిగా ఉండాలని సూచించారు.

అనంతరం నిజామాబాద్ డిప్యూటి కమీషనర్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) ఎస్. జయ్ రామ్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నిన్నటి వరకు సామాన్య పౌరులుగా ఉన్న మీరు నేడు పోలీస్ కుటుంబంలో సభ్యులుగా మారారని, మీ వేశ బాషల్లో మార్పులురావాలని, ఈ శిక్షణ సమయంలో ఇండోర్/అవుట్డోర్ తరగతులు ఉంటాయని, శిక్షణ సమయంలో భోజనం / వైద్య అంశాలలో ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోంటున్నామని అన్నారు.

కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ (ఎ.సి.పి) టి.యస్. శ్రావణ కుమార్, నిజామబాద్, ఆర్మూర్, బోధన్, సి.సి.ఆర్.బి, ట్రాఫిక్ ఎ.సి.పిలు ఎల్. రాజా వెంకట్ రెడ్డి, బస్వారెడ్డి, పి. శ్రీనివాస్, ఎ. రవీందర్ రెడ్డి, నారాయణ, పోలీస్ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డా? సరళ, రిజర్వు ఇన్స్‌పెక్టర్‌లు కె.శ్రీనివాస్ (సి.టి.సి), రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భాష లేకుండా మానవజాతికి ఆలోచన లేదు



మాతృభాష దినోత్సవంలో పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-సిరికొండ

భాష అనేది ఒక జాతి ప్రత్యేకమైన గుర్తింపుగా ఉంటుందని భాష లేకుండా మానవజాతికి ఆలోచన లేదని కిడ్స్ పార్క్ స్కూల్ పాఠశాల కరస్పాండెంట్ జాకీర్ హుస్సేన్ అన్నారు. బుధవారం నాడు కిడ్స్ పార్క్ స్కూల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ప్రతి ఏటా ఫిబ్రవరి 21 తేదీన ప్రపంచం మాతృభాష దినోత్సవం నిర్వహించుకుంటామని అదే విధంగా భాష అనేది కేవలం మాటలతో మాత్రం రూపొందించినది కాదని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీవోను సన్మానించిన ఎంపీపీ

నవతెలంగాణ-వర్ని

చందూర్ మండల ఎంపీడీవో నీలావతి బదిలీ కావడంతో ఎంపీపీ లావణ్య రామ్ రెడ్డి ఆమెను శాలువాతో సన్మానించారు. మండల ప్రజా పరిషత్‌లో గ్రామ పంచాయతీల అభివృద్ధి చేసిన సేవలు గుర్తుచేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


ఎంపీడీవోను సన్మానిస్తున్న ఎంపీపీ

పొగాకు బట్టి దగ్ధం

- మూడు లక్షల ఆస్తి నష్టం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గ్రామంలో సోన్ కాంబ్లే దిలీప్ అనే రైతుకు సంబంధించిన 30 క్వింటాళ్ల పొగాకు బట్టి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని సుమారు మూడు లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పొగాకు పంట అగ్నికి ఆహుతి కావడంతో రైతుకు తీవ్ర నష్టం వాటిల్లిందని వారు తెలిపారు. బాధితుడికి ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


దగ్ధమైన బట్టి

వాహనాలు, పని ముట్ల కొనుగోళ్లపై విచారణ జరపాలి

- బహుజన లెఫ్ట్ పార్టీ


మాట్లాడుతున్న దండివెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ శాఖలో 5 వేల కోట్ల రూపాయల అవినీతి జరిగినట్లు మీడియా సాధనాల్లో వస్తున్న కథనాల నేపథ్యంలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 2017 నుండి కొనుగోలు చేసిన వాహనాలు, పని ముట్లపై వివిధ అభివృద్ధి పనుల పేరుతో జరిగిన పనులపై విచారణ జరిపి సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బహుజన లెఫ్ట్ పార్టీ(బిఎల్‌పి) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో మున్సిపల్ కార్మికులకు సరఫరా చేసే పని ముట్లు, చీపుర్లు, యూనిఫామ్స్, తోపుడు బండ్లు నాసిరకం వల్ల వారం పదిరోజులు వాడితేనే చెడిపోతున్నాయని తెలిపారు. కొంత మంది మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం, అవినీతి వల్ల లక్షలాది రూపాయల నిధుల దుర్వినియోగం అవుతున్నాయి ఆరోపించారు. నూనెలు, సబ్బులు, చెప్పులు సరైన సమయంలో సరఫరా చేయడంలేదని విమర్శించారు. ఇంజనీరింగ్ సెక్షన్ వాటర్ సప్లయ్ గార్డెన్స్, స్ట్రీట్ లైట్స్ కార్మికులకు రక్షణ పరికరాలు,రాత్రి పూట డ్యూటీ కార్మికులకు టార్చ్ లైట్స్, గార్డెన్స్‌లో కొడవళ్ళు, గొడ్డళ్ల ఇవ్వడం లేదని తెలిపారు. దీంతో పనిముట్లను చాలీచాలని జీతం నుండే కార్మికులు కొనుగోలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, కలెక్టర్ దృష్టి సారించి విచారణ జరిపి సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే మున్సిపల్ కార్పొరేషన్ ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, బీఎల్‌పి జిల్లా కన్వీనర్ కె.మధు, బిఎల్ పి నగర అధ్యక్షులు ఎం. అజయ్, బిఎల్‌టియు నగర అధ్యక్షులు తిట్టే రాజు, బహుజన లెఫ్ట్ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గీతాంజలి, కార్యదర్శి దండు జ్యోతి పాల్గొన్నారు.


ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల అధ్యక్షులుగా విక్రాంత్


ఎన్నికైన నూతన కమిటీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి- ఇందల్‌వాయి మండలాల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల ఎన్నికలు బుధవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని వందేమాతరం పాఠశాలలో నిర్వహించారు. అధ్యక్షులుగా టీ.ఎం. విక్రాంత్ (వందేమాతరం హై స్కూల్), జనరల్ సెక్రెటరీగా తేలు గంగాధర్ (జ్ఞాన వాగ్దేవి స్కూల్-ఇందల్ వాయి మండల కేంద్రం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఆమేటి సాయిలు (వివేకానంద స్కూల్), ముఖ్య సలహాదారుడు జీకే గంగారెడ్డి (జీనియస్ హై స్కూల్) సభ్యులుగా ఎండి. నబి (వాణి హై స్కూల్), కోదండ రామయ్య (విజ్ఞాన్ స్కూల్), ఆమేటి అరవింద్ (శ్రీ వాగ్దేవి స్కూల్), కే. గంగారాం (సాయి బ్లెస్సింగ్ స్కూల్), ఎండి.జుబేర్ (రైన్, సైన్ స్కూల్), లీనా (విశ్వశాంతి స్కూల్), వెంకటరమణ (చందమామ స్కూల్), సోమనాథ్ (నేషనల్ స్కూల్) ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి, వినోద్ (భారతి విద్యానికేతన్) (జోసెఫ్ సెయింట్ జోసెఫ్ స్కూల్), ధర్మారం (బి) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు టీఎం. విక్రాంత్ మాట్లాడుతూ.. పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేయాలని, ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొని వచ్చి పరిష్కరించే విధంగా కృషి చేస్తామని విక్రాంత్, తేలు గంగాధర్ అన్నారు.

పెరిగిన వీడీఏ అమలు చేయాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోగల తెలంగాణ బీడీ యాజమాన్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దర్మేంద్రగాంధీకి బుధవారం తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం(బిఎల్‌టీయూ) ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు, యస్, సిద్దిరాములు మాట్లాడుతూ... బీడీ కార్మికులందరికీ పెరిగిన కరువు భత్యం (వీడీఏ) వచ్చే ఏప్రిల్ ఒకటినుండి అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న అన్ని కేటగిరీల కార్మికు లకు కరువు భత్యం (వీడీఏ) పెరిగిందన్నారు. వెయ్యిబీడీలకు రూ.11.30 పైసలుపెరిగిందని తెలిపారు. నెలసరి జీతాల ఉద్యోగులైన బీడీ సార్టర్, ఆకు, తంబాకు పంచేవారు, గుమస్తాలకు, అకౌంటెంట్లకు, బట్టీవాల, చెన్నీ వాల, గంపవాల, వాచ్ మెన్ లకు నెలకు 339 రూపాయల చొప్పున పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ ప్యాకర్లకు ఒక్కరోజు పనికి 11 రూపాయల 30 పైసలు చొప్పున లక్ష బీడీ ప్యాకింగుకు కరువు భత్యం ఎంత అనేది నిర్ణయిం చబడుతుందని తెలిపారు. సమావేశంలో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం నిజామాబాదు జిల్లా కార్యదర్శి, సైయ్యద్, బిఎల్ టీయూ, నాయకులు, జి,యదయ్య,జె,విశ్వనాథం,,బీడీ యూనియన్, నాయ కురాలు, జి,లక్ష్మి, సి,హెచ్, విజయలక్ష్మి, చెలిమెల పుష్ప పాల్గొన్నారు.

బంజారాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- సేవాలాల్ ఆశయాలకు కట్టుబడి ఉండాలి
- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-బోధన్

బంజారాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నారు.బుధవారం బోధన్ పట్టణంలోని అప్నా ఫంక్షన్ హాల్ లో ప్రభుత్వం తరపున నిర్వహించిన సంత్ సేవాలాల్ 285వ జయంతి, బంజారా సాంస్కృతిక సంబరాలు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సేవాలాల్ మహారాజ్ తన 12వ యేటనే గిరిజనుల బాధలు చూసి చలించి తాండాల్లో పర్యటించి వారిలో చైతన్యం కలిగించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని, ఆయన సేవలు మహోన్నతమని, ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరు పయణించాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా అధికారికంగా సెలవు ప్రకటించాలని అన్నారు. ఆయన జయంతి కార్యక్రమాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు కోట్ల రూపాయల నిధులు వెచ్చించి నిర్వహిస్తున్నామని తెలిపారు. గిరిజన విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. తాను ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఓ యువకుడు డాక్టర్ చదవడానికి రిజర్వేషన్లు కాకుండా జనరల్ కోటాలో సీట్ సాధించారని, ప్రతి ఒక్కరు అలాగే కావాలని అన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థ కుంటుపడిందని, ఈ ప్రభుత్వంలో పాఠశాలల అభివృద్ధికి కోట్ల రూపాయలు వెచ్చించడం జరిగిందన్నారు. పిల్లలను ప్రైవేటు పాఠశాలకు పంపి ఆర్థిక ఇబ్బందులకు గురి కావద్దని సూచించారు.ఈ విద్యాసంవత్సరం నాటికి 75శాతం ఫలితాలు సాధించాలన్నారు. త్వరలో ఆరు గ్యారెంటీ పథకాలలో భాగంగా గ్యాస్, పింఛన్ల పంపిణీ చేపడతామన్నారు. ఎన్ఎస్ఎఫ్ భూముల ఆగిన రిజిస్ట్రేషన్‌లను ఇబ్బందులు లేకుండా ప్రారంభించాలని, రెవెన్యూలో అవినీతిపరులను గుర్తించి సస్పెండ్ చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన గిరిజన యువతలతో సరదాగా నృత్యం చేశారు. గిరిజన మహిళలు చేసిన జానపద నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, ఏసిపి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ , ఆల్ ఇండియా బంజారా సంఘం నాయకులు చంద్రనాయక్, జక్రాన్ నాయక్, రామరావు చౌహాన్, రమేష్ రాథోడ్, తాసిల్దార్ గంగాధర్, ఎంపిడిఓ వెంకటేష్ యాదవ్, స్థానిక నేతలు ధూప్ సింగ్, లక్ష్మణ్ చౌహాన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే


గిరిజన వేషాధారణలో డ్యాన్సు చేస్తున్న విద్యార్థినులు

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే

- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

గిరిరాజా ప్రభుత్వ కళాశాలలో నిర్వహిస్తున్న 2023-2024 ఇంట్రామ్యూరల్ స్పోర్ట్స్ ప్రారంభోత్సవానికి ముఖ్యతిథిగా నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొని స్పోర్ట్స్ పతకాన్ని ఆవిష్కరించి, క్రీడలను ప్రారంభించారు. విద్యార్థులు యోగ, కర్రసాము, ప్రదర్శించారు. అనంతరం ధన్‌పాల్ మాట్లాడుతూ.. విద్యతో పాటు శారీరక, మానసిక ధృఢత్వం పెంపొందించుకోవాలని, మానసిక ధృఢత్వం కోసం యోగ కార్యక్రమాలు, శారీరక ధృఢత్వం కోసం క్రీడల్లో పాల్గొనాలని, ఆడపిల్లల ఆత్మరక్షణకు కర్రసాము లాంటివి నేర్చుకోవాలని తెలిపారు. మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉన్నప్పుడే విద్యలో రాణించ గలుగుతారని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారతదేశన్ని గొప్ప క్రీడా దేశంగా స్థాపించడానికి ఖేలో ఇండియా కార్యక్రమం ప్రవేశపెట్టారని అన్నారు. గిరిరాజ్ కళాశాల రాష్ట్రంలో మంచి గుర్తింపు పొందిన కళాశాల అని, మట్టిలో మాణిక్యాలుగా మన జిల్లా నుండి అనేకమంది ముఖ్యంగా ఈ కళాశాల నుండి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు ఉండటం గర్వించదగ్గ విషయమని అన్నారు. స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటు చేయాలని, అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరానని తెలిపారు. క్రీడా ప్రాంగణానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గిరిరాజా కాలేజీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాంమోహన్ రెడ్డి, పీఈటి మేడం బాలమణి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మినారాయణ, కార్పొరేటర్ ప్రవళిక శ్రీధర్, మమత, ప్రభాకర్, మండల అధ్యక్షులు గడ్డం రాజు, బట్టికిరి ఆనంద్, భాస్కర్ శివునూరి, చింతకాయల రాజేందర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ధన్‌పాల్‌కు బొకే అందజేస్తున్న ప్రిన్సిపాల్

బాధితుడికి ఎల్‌ఓసి అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కమ్మర్‌పల్లి మండలకేంద్రానికి చెందిన పాలెపు చిన్న గంగారం అనారోగ్యంతో బాధపడుతూ హైదారాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స కోసం ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతుండడంతో విషయాన్ని రాష్ట్ర నేషనల్ యూత్ ప్రాజెక్ట్, యునైటెడ్ నేషన్స్ ఆఫ్ యూత్ ఆర్గనైజేషన్, దక్షిణ ఆసియా మైత్రి సదస్సు కోశాధికారి, బాల్కొండ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ముత్యాల సునిల్ కుమార్‌కు తెలిపారు. వెంటనే ఆయన ముఖ్య మంత్రి తో మాట్లాడి బాధితుడికి ఆర్థిక సహాయం కింద రూ. లక్ష 15వేల ఎల్‌ఓసిని ఇప్పించారు. ఈ మేరకు ఎల్‌ఓసి పత్రాన్ని బాధితుడు పాలెపు చిన్న గంగారాంకు అందజేశారు. ముత్యాల సునిల్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు.

పోలియో చుక్కలు వేయించాలి

నవతెలంగాణ-ఆర్మూర్

పోలియో చుక్కలు వేయించాలని గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మానస సూచించారు. బుధవారం పెర్కిట్, మామిడిపల్లి, గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలలో జరిగిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చ్ 3,4,5 తేదీల్లో జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని 0 నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పకుండా అందించాలని సూచించారు. దీనివల్ల అవిటితనం రాకుండా కాపాడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు జక్కుల మోహన్, శ్యామల, ఎస్తేరు రాణి, గణేష్, అరుణ కవిత, విజయ ఆశా కార్యకర్తలు గర్భిణీ స్త్రీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు

అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమంలోనూ, సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఎస్బీఐ ఎప్పుడు తమ వంతు కీలక పాత్ర పోషిస్తూ వారి అభ్యున్నతిలో ముందు ఉందని ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ సూర్య కాంత దాస్ అన్నారు. బుధవారం నగరంలోని ప్రగతి నగర్ బ్రాంచ్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎస్బిఐ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయ భవన ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీజీఎం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధర్యంలో నడుస్తున్న రూరల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అన్‌ఎంప్లాయిడ్ యూత్ ట్రైనింగ్ సెంటర్లో శిక్షణ పొందిన మహిళలకి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన పే బ్యాక్ టు ద సొసైటీ' కార్యక్రమంలో భాగంగా కుట్టు మిషన్లు చేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న మహిళలకు చీరలను అందజేశారు. రీజనల్ మేనేజర్ నిజామాబాద్ శ్రీకాంత్ మన్యం, గోదావరిఖని అనుపమ ఆదర్శ్, ఆదిలాబాద్ శ్రీనివాస్ మంచిర్యాల సంజీవ్ కుమార్ సహా- కామారెడ్డి, దీనా నాద్ ఝా హాజరయ్యారు. ఎస్బిఐ, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘంను అభినందించారు. ఎస్బిఐలో అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం, ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం, వారి అభివృద్ధికి తోడ్పడుతానని అన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులకు ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా ఎస్బిఐ ఎస్సీ, ఎస్టి ఉద్యోగుల రాష్ట్ర సంఘం అధ్యక్షులు సూర్యం ధారావత్, ప్రధాన కార్యదర్శి భార్గవ కుమార్ పాల్గొని మాట్లాడుతూ... ఎస్బిఐ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం కోసం నూతన కార్యాలయాన్ని ఇవ్వడమే కాకుండా స్వయంగా ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు బి.రవి, జిల్లా ఉపాధ్యక్షులు ప్రజ్యోత్ కుమార్, నాయకులు సుదర్శన్ అజ్మీరా, రమేష్, ఎల్.రమేష్, ప్రదీప్ రాథోడ్, అంబేద్కర్, అశోక్ కుమార్ నాగేశ్వరరావు, బానోత్ రవి కుమార్ పాల్గొన్నారు.



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎస్‌బీఐ అధికారులు

ఆడబిడ్డ కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అంజేస్తున్న మాజీ జడ్పీటీసీ సభ్యులు

నవతెలంగాణ-ముప్కాల్

ఉమ్మడి బాల్కొండ మండల మాజీ జడ్పీటీసీ సభ్యులు జోగు సంగీత-నర్సయ్య దంపతులు ఆడబిడ్డకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు తమవంతు సాయంగా రూ.5 వేల రూపాయలను ఆర్థికంగా అందజేస్తామని గత కొద్దిరోజుల కిందట తెలిపారు. ఈమేరకు బుధవారం మండల కేంద్రానికి చెందిన దంపతులకు ఆడబిడ్డ జన్మించడంతో రూ.5 వేల రూపాయలను ఆర్థికంగా అందజేశారు. అనంతరం జోగు సంగీత-నర్సయ్య మాట్లాడుతూ మండల కేంద్రంలో ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు భరోసాగా ఈ ఆర్థిక సాయం అందజేయడం జరుగుతుందని అన్నారు. డబ్బులను ఆడబిడ్డ పేరు మీద డిపాజిట్ చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో దాసరి నర్సింగ్ దాస్, పెంటు గంగాధర్, మయూర్ పాల్గొన్నారు.

రైతాంగ డిమాండ్‌లు నెరవేర్చాలని

ప్రధాని మోడీ చిత్రపటానికి వినతి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) అఖిల భారత రైతు కూలి సంఘంల ఆధ్వర్యంలో బుధవారం మోడీ చిత్రపటానికి రైతంగా సమస్యల పై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు ఆకుల పాపయ్య, ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ వారం రోజులుగా ఢిల్లీ పరిసర ప్రాంతంలో, హర్యానాలో రైతులు ఆందోళనలు చేస్తున్నారన్నారు. వారి న్యాయమైన డిమాండ్లు గత రైతు ఉద్యమానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలను అమలు చేయాలనీ కోరారు. ఎంఎస్పి పంటలకు మద్దతు ధరల గ్యారంటీ చట్టాన్ని పార్లమెంట్‌లో తీసుకురావాలని, విద్యుత్ సవరణ బిల్లు 2020 ను ఉపసంహరించాలని, రైతులపై కేసులను ఎత్తివేయాలని అన్నారు. రైతుల అప్పులను మాఫీ చేసి రైతులను రుణ విముక్తులను చేయాలని, రైతు ఉద్యమంలో చనిపోయిన 750 మంది రైతు కుటుంబాలకు నష్ట పరిహారం ఎక్స్ గ్రేషియా చెల్లించి వారి కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్లతో వారు ఢిల్లీ కేంద్రానికి వస్తున్నారని తెలిపారు. వీటినిగతంలో ప్రధాని నరేంద్ర మోదీ రైతులకు ఇచ్చిన హామీలే అని అన్నారు. చెరుకు పంటకు చక్కర రికవరీ శాతం 8.5 శాతం పై నుంచి రైతుకు ధర నిర్ణయించి ఇచ్చేవారని, కానీ కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు దానిని 10.2 శాతానికి పెంచడం మూలంగా రైతుకు గిట్టుబాటు కావడం లేదని వారు అన్నారు. దేశంలో చక్కెర నిల్వలు తగ్గిపోతున్నాయని, అందుకేనేమో ఇథనాల్ ఉత్పతులను నిలుపుదల చేసిందని వారు తెలిపారు.చెరుకు ఉప ఉత్పత్తుల ద్వారా అనేక లాభాలు వస్తున్నాయని, 8.5 శాతం రికవరీ పైనే ధర నిర్ణయించి రైతులకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో గల రెండు చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించి నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దేశంలో సరిపడా ఆయిల్ నిల్వలు లేనందున ఇతర దేశాలనుండి దిగుమతులు చేసుకుంటున్నాం అని తెలిపారు. అందుకు గాను నూనెగింజల ఉత్పతులను పెంచాలని, ఆయిల్ ఫామ్ పంటలను ప్రోత్సహించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య, ఎస్కేఎం మచ్చర్ల నాగయ్య, నాయకులు చిన్న పార్వయ్య, ఏఐకెఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు అగ్గు చిన్నయ్య, జిల్లా సహాయ కార్యదర్శి, నాయకులు, శివ కుమార్, అంజయ్య, రాజు, పాల్గొన్నారు


చిత్రపటానికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

విద్యార్థినుల క్షేత్ర పర్యటన


అగ్నిమాపక శాఖ పనితీరు వివరిస్తున్న అధికారి

నవతెలంగాణ- బాల్కొండ

మండల కేంద్రంలోని మైనారిటీ బాలికల పాఠశాల గురుకుల విద్యార్థినీలు, సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులు బుధవారం క్షేత్ర పర్యటనలో భాగంగా పలు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. పర్యటనలో భాగంగా తపాలా కార్యాలయం, పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, అగ్నిమాపక కార్యాలయాలను సందర్శించారు. అధికారులు, సిబ్బంది విద్యార్థుల ప్రశ్నలన్నిటికీ ఓపికతో సమాధానం ఇచ్చారు. అధికారుల నుండి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల పనితీరుపై విద్యార్థినులు ఎన్నో ఆసక్తికరమైన విషయాలను అడిగి తెలుసుకున్నారని ప్రధానోపాధ్యాయురాలు వాణి తెలిపారు. విద్యార్థుల సహకరించిన తహసీల్దార్ ఏ శ్రీధర్, ఎస్సై కే గోపి, ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, ఫైర్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ హరికృష్ణ, బి శేఖర్, తపాలా శాఖ అధికారిని కే శ్వేత, తదితర అధికారులందరికీ ప్రిన్సిపాల్ వాణి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ హైర్ బస్ డ్రైవర్‌పై దాడి

- డిపో ఎదుట నిరసన

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ టీఎస్‌ఆర్‌టిసి బస్ స్టాండ్‌లో బుధవారం ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్‌పై ప్రయాణికులు దాడి చేయడం తీవ్ర కలవరం రేపింది. కండక్టర్‌ను పిలిచేందుకు డ్రైవర్ రెండు సార్లు హారన్ కొటారు. .దీంతో అక్కడే ఉన్న ఓ ప్రయాణికుడు వచ్చి అసభ్యంగా తిడుతూ డ్రైవర్‌పై భౌతిక దాడికి దిగాడు. దీంతో పలువురు టిఎస్‌ఆర్టిసి సిబ్బందితో కలిసి డిపో ఎదుట నిరసన చేపట్టారు. డ్రైవర్‌ను కొట్టిన వ్యక్తిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
3
గురువారం | ఫిబ్రవరి 22, 2024 | www.navatelangana.com

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గొల్లపల్లిలో బుధవారం సీసీ రోడ్డు పనులను జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధుల క్రింద రూ.5లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముత్తినేని రవీందర్రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహేందర్‌రెడ్డి, కిషన్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష అట్టలు అందజేత



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని అన్నారం జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు నా రెడ్డి స్వచ్ఛంద సంస్థ ద్వారా పరీక్ష అట్టలను, నా రెడ్డి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు నా రెడ్డి మోహన్ రెడ్డి అందజేశారు. అనంతరం కన్నాపూర్ ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి కనీసం చదవడం, పాటు చతుర్ముఖ ప్రక్రియలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముత్తినేని రవీందర్రావు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- **ఎమ్మెల్యేకు సీఐటీయూ వినతి**

నవతెలంగాణ-జుక్కల్

జీపీ కార్మికులందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు సురేష్ గొండ కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సురెన్స్ సౌకర్యాలతో పాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. జుక్కల్, బిచ్కుంద రెండు మండలాల జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతు ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావును బుధవారం కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సదర్భంగా సురేశ్‌గొండ మాట్లాడుతూ కార్మికులందరికి డబుల్ బెడ్‌రూంలు ఇవ్వాలని దాదాపుగా ఐదారు నెలలుగా వేతనాలు కూడా ఇవ్వలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జీపీ కార్మికుల సమస్యలన్నింటికి రాష్ట్ర పంచాయత్ రాజ్ శాఖ మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇస్తున్నాని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు ఎమ్మెల్యేను సన్మానించారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

ఎమ్మెల్యేగా గెలుపొంది కార్మికులతో తొలిసారి ముఖాముఖి అయినందన ఎమ్మెల్యేకు శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జుక్కల్, బిచ్కుంద రెండు మండల గ్రామ పంచాయతి సఫాయి కార్మికులు గోవింద్, వీరయ్య, గంగారాం, జ్ఞానేశ్వర్, సాయులు, శంకర్, లింగురామ్, లక్ష్మన్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు సన్మానం

జుక్కల్ మండలంలోని పలు జీపీ కార్మికులకు కౌలాస్ గ్రామానికి చెందిన విండో డైరెక్టర్ అనితాసింగ్ ఎమ్మెలే క్యాంప్ కార్యాలయంలో జుక్కల్ ఎమ్మెలే తోట లక్ష్మీకాంతారావు కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా అనితాసింగ్ మాట్లాడుతూ.. గ్రామాలలో మురికి కాలువలను శుభ్రం చేస్తు తమ రోగాలను పణంగా పెట్టి ప్రజల బాగుండాలని తమ జీవితాలనే ప్రజల పరిశుభ్రత కొరకు పణంగాపెట్టి నిత్యం శ్రమిస్తుంటారని కొనియాడారు. అనారోగ్యం పాలైపా అతీగతి లేకుండా సేవలందిస్తున్న మహిళా జీపీ కార్మికుల విధులను వెల కట్టలేనిదని అన్నారు. కార్యక్రమంలో సిఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు సురేష్ గొండ, మండల కాంగ్రెస్ నాయకులు, అన్ని జీపీల సఫాయి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

24 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు

నవతెలంగాణ-కామారెడ్డి

ఈనెల 24 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్ లోయర్ గ్రేడ్ 24 నుంచి 27 వరకు ఉదయం 10 గంటల నుంచి 12:30గంటల వరకు, హయ్యర్ గ్రేడ్ మధ్యాహ్నం 2గంటల నుంచి 4:30 గంటలకు నిర్వహిస్తామని తెలిపారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్ పరీక్ష 25 నుంచి 27 వరకు ఉదయం 10 గంటల నుంచి 1గంట వరకు, హయ్యర్ గ్రేడ్ పరీక్ష 2గంటల నుంచి 5గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లను www.bse.telangana.gov.in వెబ్సైట్ నుంచి విద్యార్థి పేరు, పుట్టిన తేదీలను నమోదు చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పెన్సిల్, కలర్స్, పరీక్ష అట్టలు ఇతర సామాగ్రి వెంట తెచ్చుకోవాలని సూచించారు. టైలరింగ్ ఎంబ్రాయిడరీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కుట్టుమిషన్లు, టేబుల్, కత్తెర సామాగ్రిని వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

పూజా సామాగ్రి వేలం



వేలం పాటలో పాల్గొన్న అసిస్టెంట్ కమిషనర్

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణంలో పూజా సామాగ్రి అమ్మటానికి వేలంపాట బుధవారం నిజామాబాద్ ఉమ్మడి జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎన్.సుప్రియ సమక్షంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీధర్, ఆలయ సిబ్బంది, వివిధ గ్రామాల భక్తుల ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో ఏడుగురు పదివేల రూపాయల చొప్పున డిపాజిట్ చేసి పాల్గొన్నారు. ఈ వేలం పాటలో టీ.కృష్ణాని భక్తుడు రూ.5లక్షల 4వేలకు వేలంపాట పాడి దక్కించుకున్నారు. ఈ వేలం పాటలు సలబత్‌పూర్ ఆంజనేయస్వామి ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీధర్, ఆలయ క్లర్క్ వేణు, కల్పన, సిబ్బంది వివిధ గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

ముదిరాజులు ఐక్యంగా ఉంటూ రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని ముదిరాజ్ ఉద్యోగ సంఘ జిల్లా అధ్యక్షులు బాలకిషన్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ముదిరాజ్ ఉద్యోగ సంఘం క్యాలెండర్‌ను మాజీ సర్పంచ్ దండ బోయిన సంజీవ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి ముదిరాజులకు అవగాహన కల్పిస్తూ, వారికి అండగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్, జూనియర్ అసిస్టెంట్ రాజకుమార్, మండల ముదిరాజ్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం సరఫరా

- **ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం : సీపీఐ(ఎంఎల్)**

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని మద్యం (వైన్స్) యాజమాన్యం గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం బెల్ట్ షాపులను ఏర్పాటు చేసి నకిలీ మద్యం సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారని వీరిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్.రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం సిరికొండ మండల కేంద్రంలో సిరికొండ తహసీల్దార్ రవీందర్‌రావ్‌కు వినతి పత్రం అందజేసి మద్యం షాపుల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లోని మద్యం బెల్ట్ షాప్‌లను రద్దు చేస్తాం అని హామీ ఇచ్చి ఇప్పుడు మద్యం షాప్‌లను పట్టించుకోక పోవడం ఇచ్చిన హామీని విస్మరించడమేనన్నారు. ముఖ్యంగా సిరికొండ మద్యం వ్యాపారులు మండలంలోని గ్రామాలను పంచుకొని డబ్బులే లక్ష్యంగా నాసిరకం మద్యం, సీల్ లేని మద్యం, నిబంధనలకు వ్యతిరేకంగా గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం ఏరులై పారుతున్న అబ్కారిశాఖ అధికారులు ముడుపులకు అలవాటు పడి బెల్ట్ షాపులను నడపడానికి పరోక్షంగా సహకరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా బెల్ట్ షాపులను రద్దు చేయాలనీ, సిరికొండ వైన్స్ యజమానుల దోపిడీని అరికట్టాలని, అక్రమ వ్యాపారం చేస్తున్న వైన్స్‌ల లైసెన్స్‌లను రద్దు చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు ఆర్.దామోదర్, సాయరెడ్డి, పివైఎల్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ అనీస్, మండల నాయకులు కిషోర్, గంగాదాస్, సాయిలు, నాగన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు జుక్కల్ మండలానికి నూతనంగా వచ్చిన తహసీల్దార్ హిమబిందును బుధవారం కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. జుక్కల్ మారుముల ప్రాంతం కావడంతో పాటు నిరక్ష్య రాశులు ఎక్కువగానే ఉంటారని, మూడు భాషలు మాట్లాడుతుంటారని అర్థం చేసుకుని ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ సన్మాన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అరుణ్, బాబు, అనీల్, విఠల్, మారుతీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు తరలిన రైలు



అయోధ్యకు బయలుదేతున్న దృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి రైల్వేస్టేషన్ నుంచి అయోధ్యకు వెళ్తున్న ప్రత్యేక రైల్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణతారా బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కామారెడ్డి రైల్వేస్టేషన్ నుండి ప్రారంభమైన రైలులో 1345 మంది వెళ్లారని, వారి కోసం రామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్, అభియాన్ రాష్ట్ర కన్వీనర్ కాటిపల్లి వెంకట రమణరెడ్డి సౌకర్యాలు కల్పించినట్టు తెలిపారు. ఈ నెల 26 వరకు దర్శనం పూర్తి అయ్యి తిరిగి కామారెడ్డికి చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆలే భాస్కర్, పైడి ఎల్లారెడ్డి, జైపాల్‌రెడ్డి, రంజిత్ మోహన్, మర్రి రాంరెడ్డి, తెలు శ్రీనివాస్, బాపురెడ్డి, రాము, భరత్, సురేష్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

'లక్‌పతి దీదీ'పై శిక్షణ శిబిరం

నవతెలంగాణ-జుక్కల్

ఐకేపీ, ఏపీఎమ్ సత్యనారాయణ అధ్వర్యంలో జుక్కల్, మద్నూర్ రెండు మండలాల గ్రామసంఘం సహాయకులు, సిసిలకు రెండు రోజుల ప్రత్యేక శిక్షణ తరగతులు మొదటి రోజు స్థానిక మండల సంఘం సమాఖ్యహాలులో "లక్‌పతి దీదీ" కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా డీఆర్డీఏ కార్యాలయ అధికారులు డీపీఎమ్ వకుల, ఏపీఎం రాజేందర్ మొదటి రోజు శిక్షణ తరగతులు ప్రారంభించారని జుక్కల్ మండల ఐకేపీ ఏపీఎమ్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా డీపీఎమ్, ఏపీఎమ్, శిక్షణ తరగతిలో మాట్లాడుతూ.. మహిళలకు అవసరమైన రుణాలు సరియైన సమయంలో అందించి, స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక అభివృద్ధి చెంది, ప్రతి మహిళ లక్షాదీకారులు చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. మహిళలు తీసుకునే ప్రతి రూపాయి పెట్టుబడిగా పెట్టి వ్యాపారాలు చేయాలని, వ్యాపార మెళకువలను తెలుసు కోవాలని సూచించారు. మహిళ సంఘాలు తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్డిఏ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వకుల, ఏపీఎం రాజేందర్, జుక్కల్ ఏపీఎం సత్యనారాయణ, మద్నూర్ ఏపీఎం మనోహర్, రెండులాల సిసిలు, వీవోఏలు పాల్గొన్నారు.



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీపీఎం వకుల

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల పరిషత్ కార్యాలయంలో ఇంచార్జ్ ఎంపీడీఓ తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధిహామీ తదితర పనులపై పంచాయితీ కార్యదర్శులు ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ ఎంపీడీఓ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామం లో ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పని కల్పించాలని, గ్రామ పంచాయితీ డెవలప్మెంట్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. వంద శాతం ఇంటి పన్నులు వసూల్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. వేసవి కాలం వస్తున్నందున గ్రామాలలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని, గ్రామం లో పారిశుద్ధ్య నిర్వహణ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమం లో పంచాయితీ కార్యదర్శులు సౌజన్య, శేఖర్, అరుణ, ఏపిఓ రజనీ,ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత ఆశయంతో చదవాలి



మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ నోడల్ అధికారి

నవతెలంగాణ-సదాశివనగర్

విద్యార్థులు ఉన్నత ఆశయంతో చదివి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం సూచించారు. సదాశివనగర్ ప్రభుత్వ కళాశాలలో క్రీడా సాంస్కృతిక దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతితులుగా ఇంటర్ అధికారితో పాటు సీఐ బి సంతోష్ కుమార్, ఎస్సై ఎస్ రాజు కళాశాల ప్రిన్సిపల్ అజ్మల్ ఖాన్ అదేవిధంగా డెక్ మెంబర్స్ భిక్కనూర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనాథ్ కామారెడ్డి కళాశాల లెక్చరర్ నాగేశ్వరయ్య తదితరులు హాజరైయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ పరీక్షలలో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు సాధించాలని సూచించారు. ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం ప్రతాప్ కిరణ్, ప్రకాష్‌లక్ష్మి, మల్లయ్య, ఇస్రాత్, చంద్రశేఖర్, రమేష్ రాజేందర్ చంద్రశేఖర్ ఆనంద్ సుధాకర్ రంజిత్ అంజుమ్ గంగారం రాజ్ కుమార్ శ్రీరామ్ సుస్మిత పాల్గొన్నారు.


బ్యాగులు, డ్రెస్సులు, వాటర్ బాటిల్స్ పంపిణీ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు బుధవారం శ్రీరామ సేవా సమితి కామారెడ్డి ఆధ్వర్యంలో బ్యాగులు, డ్రెస్సులు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వీణ తెలిపారు. పాఠశాలలో 235 మంది విద్యార్థులకు గాను ఈ వస్తువులను పంపిణీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీరామసేవ సమితి ట్రస్ట్ సభ్యులు గందె నర్సింలు, ఉప్పల గిరిధర్, బుచ్చయ్య, సునీల్, వెంకటేశం, గంగాధర్‌తో పటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం కోసం విరాళం అందజేత

నవతెలంగాణ-లింగంపేట్

విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సాయి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు చక్రవర్తి గౌడ్ అన్నారు. బుధవారం లింగంపేట మండలంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ పరుమల్ల పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ కామారెడ్డి ప్రెసిడెంట్ ఎంజి చక్రవర్తి గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థుల ను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రత్యేకతల కోసం వచ్చే విద్యార్థులకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సందర్భంగా హాజరైన పదో తరగతి విద్యార్థులకు నెలరోజుల పాటు ఈవినింగ్ స్నాక్స్ అందజేస్తున్నట్టు ప్రకటించారు. దీనికి పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయ బృందం కూడా శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ ఎంజి చక్రవర్తి గౌడ్‌ను సన్మానించి ప్రత్యేకమైనటువంటి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సందీప్ కుమార్, నాగరాజురావు, వినయ్ కుమార్, సునీత , సంగమేశ్వర్, బాల నరసయ్య, సురేష్, అర్చన పాల్గొన్నారు.

పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత కేసీఆర్‌దే

- **ఆడబిడ్డలంటే కెసిఆర్‌కు గౌరవం : ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి**

నవతెలంగాణ-వర్ని

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం వర్ని మండల కేంద్రంలోని రైతు వేదికలో 6 మండలాలకు చెందిన మహిళలకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు రాష్ట్రంలోని ఆడబిడ్డలు తన బిడ్డలుగా గౌరవించి వారిపెళ్లిలకు ఇతర వ్యక్తుల దగ్గర నుంచి అప్పు చేయకుండా కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ పథకాలను ఏర్పాటు చేసి రూ.1లక్ష 116. చెక్కులను అందజేసి వారికి అప్పు లేకుండా చేసిన ఘనత కెసిఆర్‌కి చెందిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, జడ్పిటిసి హరిదాస్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు పిట్ల శ్రీరాములు, మండల అధ్యక్షులు గిరి, వైస్ ఎంపీపీ బాలరాజు, కర్ణం సాయరెడ్డి, చందూర్ పిఎసిఎస్ చైర్మన్ ప్యారం అశోక్ యాదవ్, దేవి సింగ్, మేడిపల్లి రవి, సత్యనారాయణ, ఖాదర్, ఎంపీటీసీ సాయిలు, కరీం, తిప్పారం అనిత వెంకట్‌గౌడ్ పలు గ్రామాల సర్పంచులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

మాతృభాషను మరవొద్దు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని క్రిష్ణవేణి ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. మాతృభాషా గేయంతో కార్యక్రమం ప్రారంభించి, తెలుగు భాషకు సంబంధించిన వివిధ కార్యక్రమాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మన మనుగడ కోసం ఇతర భాషలను నేర్చుకున్నప్పటికీ మన తల్లితో సమానమైన మాతృభాషను మరవద్దని విద్యార్థులకు తెలిపారు. బంగ్లాదేశ్ భాష ఉద్యమానికి నివాళిగా మాతృభాష పరిరక్షణ కొరకు 1999నుండి యెనిస్కో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21న మాతృభాష దినోత్సవాన్ని జరిపాలని పిలుపునిచ్చిందని గుర్తు చేశారు. అన్యభాషలు ఎన్ని నేర్చుకున్నప్పటికీ మాతృ భాషలో ప్రావీణ్యుడు కాని వాడు విజ్ఞాన సముపార్జన చేయలేడని తెలిపారు. ప్రతి విద్యార్థి ఇతర భాషలతో పాటు మాతృభాషను చక్కగా నేర్చుకోవాలని, గౌరవించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థినిలు మాతృభాషపై చేసిన నృత్యం చూపరులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిలక గంగ ప్రసాద్, పాఠశాల డైరెక్టర్ జుంబరత్ రణధీర్, వైస్ ప్రిన్సిపల్ కుందారం సచిన్, ఉపాధ్యాయులు కమల్, మనోజ్ఞ, రమ్య, తబసుమ్, స్వప్న, రూప శ్రీ, నిఖిత, షాహిన్, తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమపై అవగాహన

నవతెలంగాణ-మాక్లూర్



మాట్లాడుతున్న పశు వైద్యులు

మండలంలోని అమ్రాద్ గ్రామంలోని పాడిరైతులకు పాడి పరిశ్రమకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యులు కిరణ్ దేశ్‌పాండే, హన్మంతు రెడ్డి గ్రామంలోని 35 మంది రైతులకు గేదెల రకాలు, గేదెల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గడ్డి జాతులు, గేదెలకోసం వేసుకోవాల్సిన షెడ్డు ఎలా వేసుకోవాలి, మేలు రకం ఆవులు, గేదెల ఎన్నిక గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ శిక్షణా సంస్థ కే. రామకృష్ణ, కో ఆర్డనేటర్ సాయి కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి, కళ్యాపూర్ గ్రామాల్లో చిన్నారులకు స్కూలు బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మేక సంతోష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న తలంపుతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపట్టిన ఓ ఎన్‌జేసి ఆధ్వర్యంలో బ్యాగులు పంపిణీ చేశారన్నారు. నరేంద్రమోడీతో సంప్రదించి బ్యాగులను ఇప్పించడానికి కృషిచేసిన ధర్మపురి అరవింద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు అసాద్ బేగ్, కళ్యాపూర్ ఎంపీటీసీ సంయుక్త, కందకుర్తి ఉప సర్పంచ్ దేవుళ్ళ యోగేష్, ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ కరీం, గంగాధర్, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ నిస్సార్ బెగ్ కల్లాపూర్ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గాండ్ల నాగరాజ్, గంగా దాస్, బాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విప్లవ పార్టీల ఐక్యత మహాసభను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-రెంజల్

విప్లవ పార్టీల ఐక్యత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా నాయకులు కోరారు. బుధవారం మండలంలోని బోరం గ్రామంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు పుట్టినడిపి నాగన్న, పార్వతి, రాజేశ్వర్ మాట్లాడుతూ రైతులు, కార్మికులు, ఉద్యోగులు, రైతు కూలీలు మాస్ లైన్ ప్రజాపంథా మహాసభకు అత్యధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు. దేశంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పేద ప్రజల హక్కుల కోసం, శ్రామిక వర్గ రాజ్యం ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో మాత్రమే సాధ్యమవుతుందని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్కె నసీర్, వడ్డెన్న, గోపాల్, మన్నె పోశెట్టి, హైమద్, సిద్ధ పోశెట్టి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల సివోఈ పరీక్ష హాల్ టికెట్స్ విడుదల

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సి వో ఈ మొదటి ప్రవేశ పరీక్షలో క్వాలిఫై అయిన అభ్యర్థులు 2 వ లెవెల్‌కి సంబంధించిన హాల్ టికెట్స్ www.tswreis.co.in వెబ్‌సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోవాలని నిజామాబాద్ జిల్లా కో-ఆర్డినేటర్ బి. సంగీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష ఈనెల 25న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డిస్క్రిప్టివ్ పద్ధతిలో ఉంటుందని పేర్కొన్నారు. హాల్ టికెట్స్ లో పేర్కొన్న వివరాలు సరిచూసుకుని సూచనలు పాటించాలని తెలిపారు. ఎగ్జామ్ సెంటర్‌కి గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు.

భ్రమలు మానుకోవాలి

నవతెలంగాణ-కోటగిరి

మాజీ సభాపతి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇప్పటికైనా భ్రమలు మానుకోవాలని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు షాహీద్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి మంగళవారం పోచారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన మున్నాల ముచ్చట అని, త్వరలో కూలిపోతుందని చెప్పడం సరికాదని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందని పేర్కొన్నారు. ఆయనతోపాటు పలువురు నాయకులున్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక



పార్టీ కండువా వేస్తున్న వేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండల పిఎసిఎస్ డైరెక్టర్ అగ్గు నారాయణ, స్థానిక డీలర్ ప్రభాకర్ మాజీ మంత్రివర్యులు, బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్ రెడ్డి సమక్షం లో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షులు మోబిన్ ఖాన్, మాజీ జెడ్పిటిసి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగభూ షణం రెడ్డి, రెంజల్ యువజన మండల అధ్యక్షులు కార్తిక యాదవ్, డిసిసి మాజీ కార్యదర్శి జావీద్ ఉద్దీన్, మాజీ మండల అధ్యక్షులు సాయి రెడ్డి పాల్గొన్నారు.

శ్రీ చైతన్య టెక్నోలో ఫ్యామిలీ ఫెస్ట్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



పాదపూజ చేస్తున్న విద్యార్థిని

నిజామాబాద్‌లోని వినాయక్ నగర్‌లోగల శ్రీ చైతన్య 'టెక్నో పాఠశాలలో స్మార్ట్ లివింగ్ కార్యక్ర మంలో భాగంగా బుధవారం ఫ్యామిలీ ఫెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన కార్పొరేటర్ ఆకుల హేమలత శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లల్లో విద్యతో పాటు నైతిక విలువలను పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలు వారి తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. వారికి తల్లిదండ్రుల మీద ఉన్న ప్రేమను చాటుకున్నారు. కార్యక్రమంలో ఏజీఎం జితేందర్, కో ఆర్డినేటర్ నరేందర్, ప్రిన్సిపాల్ రామకృష్ణ, డీన్ క్రాంతి కుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు



ఫ్యామిలీ ఫెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

శిక్షణలోని మెళకువలు ఎంతగానో ఉపయోగకరం

- కామారెడ్డి ఎస్‌పి సింధు శర్మ
- 7వ బెటాలియన్‌లో 2024 బ్యాచ్ శిక్షణ ప్రారంభం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ట్రైనింగ్‌లో మాట్లాడుతున్న ఎస్పీ సింధుశర్మ..



శిక్షణ పొందనున్న బ్యాచ్

9 నెలల శిక్షణలో నేర్చుకునే మెళకువలు ఉద్యోగంలో ఎంతగానో ఉపయోగపడతాయని, పోలీస్ అనేది ఒక బాధ్యతయుతమైన వృత్తి, వీటి గురించి శిక్షణ ఉంటుందని కామారెడ్డి జిల్లా ఎస్‌పి సింధుశర్మ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ 7వ బెటాలియన్‌లో ఎస్‌సిటిపిసిఎస్ (ఎఆర్) శిక్షణను ముఖ్య అతిథిగా కామారెడ్డి జిల్లా ఎస్‌పి సింధు శర్మ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ అనేది ఒక బాధ్యతయుతమైన వృత్తి అని, దానిని ఎంచుకున్నందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పోలీసింగ్ వ్యవస్థలో నాటి దారిదోపిడిల నుండి మొదలుకొని నేటి సైబర్ క్రైమ్ వరకు మార్పులకు అనుగుణంగా జరుగుతున్నాయని అన్నారు. వీటి గురించి శిక్షణలో తెలుపుతారని అన్నారు. ప్రతి అంశం పనికి వచ్చే దేనని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు 7వ బెటాలియన్ కమాండెంట్ బి రాంప్రకష్ మాట్లాడుతూ.. 7వ బెటాలియన్ 2002లో బెటాలియన్ ట్రైనింగ్ సెంటర్‌గ్గా గుర్తించబడిందని, నేటి వరకు (12) బ్యాచ్‌లు శిక్షణ పొందాయని తెలిపారు. వీరికి శిక్షణ ఇవ్వడానికి అసిస్టెంట్ కమాండెంట్ కె. బాస్కర్ రావు పర్యవేక్షణలో అనుభవజ్ఞులైన (36) మంది శిక్షకులను కేటాయించామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ సి. అంజనేయ రెడ్డి, కె. బాస్కర్ రావు, ఎ‌ట సి. హంసరాణి, యుఎంట యన్. అనుపమా, అర్ఐలు పి. వేంకటేశ్వర్లు, యం. నరేష్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది, మినిస్ట్రియల్ స్టాఫ్ పాల్గొన్నారు.

వర్క్ సైట్ బోర్డులు ఏర్పాటు చేయాలి

- కూలీల సంఖ్య పెంచాలి
- ఎంపిడిఓ అనంత రావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న ఎంపిడిఓ అనంత రావు

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టే పనుల వద్ద వర్క్ సైడ్ బోర్డులు ఏర్పాటు చేయాలని, కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో అనంత రావు అన్నారు. బుధవారం ఇందల్ వాయి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అనంతరావు మాట్లాడుతూ ఏడు రిజిస్టర్ లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని, జీపి డిపి 24-25 గ్రామ పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్ పూర్తి చేయాలని, నర్సరీల్లో మొక్కలు పెంచడం, ఎండను తట్టుకో వడానికి సెడ్ నెట్‌ను వేసి సంరక్షించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.వచ్చే వేసవిలో గ్రామాల్లో తాగునీటికు ఎలాంటి లోటూ పాట్లు లేకుండా చూసుకో వాలని అన్నారు. పారిశుధ్య కార్యక్రమాలు, వచ్చే వేసవిలో తాగునీటి కి ఇబ్బందులు కలగకుండా ముం దస్తుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కూలీల సంఖ్య పెంచేందుకు కృషి చేయా లని, ప్రస్తుతం జరుగుతున్న పనుల వివరా లు ఎపిఓ పోశెట్టికి అడిగి తెలుసుకున్నారు. పంచాయతీలో ఉన్న వసతుల గురించి కార్యదర్శులను అడిగి పలు సూచనలు, సలహాలు అందజేశారు. గ్రామాల్లో పారిశు ధ్య కార్యక్రమాలు, తాగునీటి వసతులు, తదితర అంశాలపై వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీధర్, నాగేష్ ,భారత్, అరుణ, సువార్త, అనూష, సింగోటం యశ్వంత్,పాశం అశోక్, సుశీల, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నోరూరించే ఇంటి వంటల ప్రదర్శన



వంటల ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-బోధన్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అమ్మ చేతి వంట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తయారుచేసిన పలు ఇంటి వంటకాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు వారి తల్లులు తయారుచేసిన రకరకాల కూరలు, పిండివంటలు ఆకట్టుకున్నాయి. వాటిని చూస్తేనే నోరూరించేలా అనిపించిందని విద్యార్థులు, ఉపాధ్యాయుల పేర్కొన్నారు. విద్యార్థులకు వంటకాలపై అవగాహన కల్పించేందుకు ఈ వంటకాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.కార్యక్రమంలో 78 రకాల వంటకాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు. పి విజయ్ కుమార్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను బతికిద్దాం.. చదివిద్దాం

- డిస్ట్రిక్ వెల్ఫేర్ అధికారి రసూల్‌బి

నవతెలంగాణ-వర్ని




మాట్లాడుతున్న అధికారి

ప్రపంచానికి సృష్టికర్త మహిళ అని, మొదటి దశ బాలిక దశ నుంచే మొదలవుతుందని, బాలికలను దేశంలో ఒక ఉన్నతమైన స్థాయిలో ఉంచవలసిన బాధ్యత తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తోటి వారికి ఉందని జిల్లా వెల్ఫేర్ అధికారి రసూల్ బి అన్నారు. బుధవారం వర్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో భేటీ బచావో-బేటి బడో కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. బాలికలను గౌరవించాలని, వారిని పాచి, బానిసత్వ పనులు చేయనివ్వకుండా చదువుకో విధంగా చూచే బాధ్యత అందరికీ ఉందని అన్నారు. భేటీ బచావో-బేటి బడో కార్యక్రమాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఇందులో ఆడపిల్లల భవిష్యత్తు కొరకు పోస్ట్ ఆఫీస్, బ్యాంకుల్లో సుకన్య యోజన పథకం ద్వారా వారి పేరుపై తల్లిదండ్రులు తక్కువ రుణం చెల్లించి ఎక్కువ ఆదాయం పెళ్లి వయసు వరకు తీసుకునే వెసులుబాటును కేంద్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. బాలికలపై అఘాయిత్యాలు చేసే వ్యక్తులకు కఠిన శిక్షలు విధించేలా ప్రభుత్వం ముందుందని తెలిపారు. బాలికలపై హింసలకు గురైతే ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్‌చేసి సహాయం పొందవచ్చని సూచించారు.

బాల్య వివాహాలు చేయాలని చూసే తల్లిదండ్రులకు పిల్లల భవిష్యత్తు పట్ల అవగాహన కల్పించే బాధ్యత అందరిపై ఉందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏటీఎం ప్రసాద్, హెల్త్ డిపార్ట్‌మెంట్ సావిత్రి, ఎంపీహెచ్‌ఓ కృష్ణవేణి, రాంబాబు, ఐ సి డిసి కౌన్సిలర్ స్వప్న, ఐసిడిసి వర్ని మండల సూపర్వైజర్ వనజ, అంగన్వాడి టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

డిఐఈఓ రఘురాజ్‌కు ఘన సన్మానం



డిఐఈవోను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం కాలేజీ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రఘురాజ్ ఉద్యోగ విరమణ సందర్భంగా కోటగిరి అధ్యాపకులు రఘురాజ్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రఘురాజు మాట్లాడుతూ.. ఈ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా చేస్తూ ఉద్యోగ విరమణ పొందడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ బాధ్యతలను నిర్వహించడానికి కోటగిరి జూనియర్ కళాశాల అధ్యాపకుల సహాయం, ప్రోత్సాహం మరువ లేనిదన్నారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిళ్లకు గురికా కుండా పరీక్షలు రాయాలని పేర్కొన్నారు. సన్మానించిన వారిలో వర్ని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కుమార్, చిరంజీవి భీమగల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, రజియోద్దీన్ ధర్పల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు దేవరాం, ప్రమోద్, సురేష్ బాబు, దత్తాత్రేయ తదితరులు ఉన్నారు.

ఇష్టపడి చదువుతూ ఉన్నత స్థాయికి ఎదగాలి

- సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా
- ఏసిపి బస్వారెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్



సన్మానిస్తున్న పలువురు

చిన్ననాటి నుంచే విద్యార్థినిలు ఇష్టపడి చదువుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని సీనియర్ సివిల్ జడ్జ్ నసీం సుల్తానా, పట్టణ ఏసిపి బస్వా రెడ్డి అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఫేర్వెల్ పార్టీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడుతూ సబ్జెక్టులపై అవగాహన పెంచుకొని తల్లిదండ్రులకు పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వనజా రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలలో జరిగిన ఫేర్వెల్ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ధనవేని, వైస్ ప్రిన్సిపాల్ శరణ్య, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

సీఎం, ఉపముఖ్యమంత్రికి చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-నందిపేట్



బీసీలు అన్ని రంగాల్లో ఎదగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంద మహిపాల్ అన్నారు. బుధవారం స్థానిక నాయకులతో కలసి అసెంబ్లీలో బిసి కులగణన బిల్లుకు ఆమోదం తెలిపినం దుకుగాను రాష్ట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఆర్మూర్ అసెంబ్లీ ఇంచార్జ్ వినయ్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పెంట ఇంద్రుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి వైఎస్ గంగాధర్, బీసీ సెల్ మండల అధ్యక్షులు గొజ్జి రాజేందర్, డీసీసీ డెలిగేట్ దేవిదాస్, మండల మైనార్టీ అధ్యక్షులు ఇషబ్, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు దమ్మాయి శ్రీను, జిల్లా సెక్రటరీ గంగారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, మండల్ నాయకులు గాదె శ్రీను,ఎలిగేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య ఎదుర్కొనేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలి

- మండల పంచాయతీ అధికారి యూసుఫ్ ఖాన్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మాట్లాడుతున్న అధికారి

ఎండాకాలంలో తాగునీటి సమస్యను ఎదుర్కోవడానికి యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని మండల పంచాయతీ అధికారి యూసుఫ్ ఖాన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మండల పంచాయతీ అధికారి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారి యూసుఫ్ ఖాన్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో గ్రామపంచాయతీలు పూర్తిస్థాయిలో ఇంటి పన్ను వసూలు చేయాలని తెలిపారు. వసూలు చేసిన ఇంటి పనులు ఆన్లైన్ చేయాలన్నారు. అన్ని పంచాయతీల్లో జీపి డిపి ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలకోసం కృషిచేయాలి

- శ్రీ భాషితలో వీడ్కోలు పార్టీ హంగామా

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



విద్యార్థులు ఉన్నత లక్ష్యాల కోసం కృషి చేయాలని కమ్మర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కళాశాల డైరెక్టర్ సుంకేట రవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పద్మశాలి విజయ సంఘం ఫంక్షన్ హాల్ లో స్థానిక శ్రీ భాషిత జూనియర్ కళాశాలల మొదటి సంవత్సర విద్యార్థులు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు పార్టీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని సుంకేటరవి మాట్లాడారు. వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని కోరారు. పోటీ పరీక్షలలో పాల్గొని ఉద్యోగాలు సంపాదించి తల్లిదండ్రుల కల నెరవేర్చాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. విద్యార్థుల కేరింతలు, హంగామాతో ఫంక్షన్ హాల్ మారుమోగింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, డైరెక్టర్ లు సిలివెరి సంజీవ్, మలావత్ సంతోష్, లెక్చరర్లు హన్మాండ్లు, సుమన్, సాయన్న, గంగారం, గజానంద్, శ్రీధర్, రాజేష్, శృతి, తదితరులు పాల్గొన్నారు.

5
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | ఫిబ్రవరి 22, 2024 | www.navatelangana.com

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో ఆనందగిరి లక్ష్మి నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 26 వరకు బ్రహ్మోత్సవలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. హనుమాన్ ఆలయం నుంచి లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహం గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగింపు చేసుకుంటూ కొండపైన ఉన్న ద్రానందగిరి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు దండల మోహన్ శర్మ, ఎం.ప్రశాంత్, వైస్ చైర్మన్ ముత్తెన్న, ఆలయ కమిటీ సభ్యులు, విడిసి సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్సు ప్రతిభా పోటీలకు రావుట్ల విద్యార్థిని

నవతెలంగాణ-సిరికొండ

జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ప్రతిభ పోటీల్లో సిరికొండ మండలం రావుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఓరగంటి రాజేశ్వరి తన ప్రతిభను చాటి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీనివాస్ బుధవారం తెలిపారు జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథి నగర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ముకరంద్ చేతుల మీదుగా జ్ఞాపిక, నగదు పురస్కారము అందుకున్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విద్యార్థి రాజేశ్వరిని, గైడ్ టీచర్ శ్యామల, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు దేవేందర్‌ని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యేల కృషి చేసినందుకు మండల పరిషత్ ఉపాధ్యక్షులు తోట రాజన్న, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు రమేష్ గౌడ్, గంగా దాస్, రమేష్ పూర్వ ప్రజాప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీనివాస్, దేవిక, ఉపాధ్యాయులు బాలయ్య ,దేవి సింగ్, సంజయ్, సుమలత, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు. గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సేమ్ టు సేమ్



- గుర్తుపట్టడం కష్టమే
- నేడు కవలల దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

లోకంలో మనిషిని పోలిన మనుషులు ఏడుగురు ఉంటారని అంటారు.. అందులో ఎంతవరకు నిజం ఉందో తెలియదు గానీ.. ఒకే రూపంలో ఉన్న ఇద్దరు వ్యక్తులను మాత్రం మనలో చాలామందిని చూశాం.. నిజ జీవితంలో అద్దంలో మాత్రమే మన రూపాన్ని మనం చూసుకోగలం. అలాంటిది ఒకే పోలికతో ఉన్న ఇద్దరినీ చూస్తే ఆశ్చర్య పోవడం ఖాయం. వీరే కవలలు.. ఒకే రూపం.. ఒకే వేషాధారణలో ఉంటే వీరిని గుర్తుపట్టడం కష్టమే. చిన్నోడు ఎవరు... పెద్దోడెవరో.. చిన్న ది ఎవరో.... పెద్దవారు ఎవరో.. అని అయోమయానికి గురవుతాం... నేడు కవలల దినోత్సవం సందర్భంగాకథనం

కవలల దినోత్సవం నేపథ్యం...

పోలాండ్ దేశంలో నివసించే మేజర్ అరాన్ విల్ కాక్స్ అనే కవల సోదరులు ఉండేవారు. వారు 1819లో తాముంటున్న ప్రదేశానికి ట్విన్స్ బర్గ్ అని పేరు పెట్టారు. ఈ కవల సోదరులు ఇద్దరు అక్క చెల్లెల ను వివాహం చేసుకున్నారు. వారిద్దరూ ఒకే రకమైన వ్యాధితో ఒకే రోజున మృతి చెందారు.. వారిద్దరిని ఒకేసారి ఖననం చేయడం జరిగింది.. వీరి సంస్మరణార్థం 1976 సంవత్సరం నుండి ఫిబ్రవరి 22న కవలల దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది.

ఒకరికి ఒకరు ఆత్మీయత బంధంతో...

ఒకే తల్లికి ఒకేసారి పుట్టిన ఇద్దరు తమ జీవితాల్లో ముందుకు సాగుతుంటే అరుదైన వ్యక్తులు రామాయణంలో సీతారాముల కుమారులు లవడు-కుషుడు, మహాభారతంలో పాండురాజు కుమారులు నకులుడు-సహదేవుడు, క్రికెట్‌లో స్టీవ్వా, మార్క్‌వా, గిలియానా, బంగుబెరిలాన్ చాయ్‌లు కవల పిల్లలుగా ప్రత్యేకంగా నిలుస్తున్నారు.. కవల పిల్లల్లో ఇద్దరు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు, ఒక ఆడ మగ పిల్లలు పుట్టడం జరుగుతుంది. కవలలుగా జన్మించిన వారు ఒకే పోలికలతో ఉంటే మేనేజైగొటిక్, వేర్వేరు పోలికలతో ఉంటే డైజీగోటిక్‌గా వ్యవహరిస్తారు. గర్భంలో ఇద్దరు పిల్లలు శరీరాలు కలిసిపోయి జన్మిస్తే వారిని అవిభక్త కవలలుగా పిలుస్తారు. వీణ వాణి లు అవిభక్త కవలలుగా జన్మించారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది కవల పిల్లలు పుడుతున్నట్లు అంతర్జాతీయ సంస్థ నిర్వహించిన సర్వే చెబుతోంది. ఒకే తల్లికి జన్మించిన కవలలు ఒకరికి ఒకరు ఆత్మీయ బంధంతో ఉంటారు. తల్లిదండ్రులు కవలలను చిన్నప్పటి నుంచి ఒకే రకమైన దుస్తులను ధరింప చేస్తూ తేడా లేకుండా పెంచుతారు. పుట్టినరోజులు, పండుగలు, పర్వదినాలకు ఓకే దుస్తులు వేసి సంబరపడి పోతారు. కవల పిల్లల్లో ఒకరికొకరికి పోటీ తత్వం ఉంటుందని సైన్స్ చెబుతోంది.

ఒకేసారి పుట్టినవారే కవలలు..

తల్లి కడుపు నుంచి ఒకేసారి ఒకరి కన్నా ఎక్కువమంది ఒకే రూపంలో జన్మిస్తే వారిని కవలలు అని అంటారు. ఫలదీకరణ తర్వాత అండం రెండుగా విభజన చెంది కవలలు పుడతారు. దీంతో 90 శాతం కవలలు ఒకే పోలికను కలిగి ఉంటారు. రెండు అండాలు విడుదల అవడంతో కూడా కవలలు జన్మిస్తారని వైద్యులు చెబుతున్నారు..



ప్రజా సేవలో ఒకరైతే.... విద్యాబోధనలో మరొకరు..

మున్సిపల్ పరిధిలోని 24వ వార్డు కౌన్సిలర్ ఆకుల రాము, లక్ష్మణ్ కవలలు. రాము ప్రజా సేవలో కాలనీ అభివృద్ధిలోనూ నిర్విరామ సేవలు చేస్తుండగా, లక్ష్మణ్ బాల్కొండ మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాల కరస్పాండెంట్‌గా కొనసాగుతున్నారు. ట్విన్స్ డేను గుర్తు చేసుకుంటూ కొత్త అనుభూతిని పొందుతున్నామని తెలిపారు.



చిన్ననాటి నుంచి పోటీ తత్వం....

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లికి చెందిన మల్లెల శ్యామ్ కూతుర్లు తేజస్విని, యశస్విని చిన్నప్పటి నుంచి పోటీ తత్వంతో చదువుతున్నారు. కవలలుగా పుట్టినందుకు మాతోపాటు మా తల్లిదండ్రులు బంధువులు ఎంతో ఆనందంగా ఉంటున్నారని ప్రస్తుతం ఇంజనీరింగ్ చదువుతున్నట్టు తెలిపారు.

లక్ష ఓట్లతో గెలిచేలా పని చేయాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ అర్బన్ 6వ డివిజన్‌కు చెందిన భూమయ్య తన అనుచరులు యాభై మందితో బిజెపి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఇరువురు లక్కం భూమేష్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ... నిజామాబాద్ అర్బన్‌లో కూడా లక్ష ఓట్లు సాధించి ఇందూర్ గడ్డ పై మరోసారి పార్టీ జెండా ఎగురావేసి నరేంద్ర మోడీకి బహుమతిగా ఇవ్వాలని కోరారు. దేశ అభివృద్ధి, దేశ రక్షణ, సబ్ కా సాత్ సబ్ కా వికాస్ బిజెపి తోనే సాధ్యం అని అన్నారు. కార్యక్రమం లో బిజెపి జిల్లా అధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షులు సుక్క మధు, కార్పొరేటర్లు బైకన్ మధు, ఎర్రం సుధీర్, మల్లేష్ యాదవ్, ఆకుల శ్రీనివాస్, వెల్డింగ్ నారాయణ,చందుపట్ల శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి బస్వాపూర్ శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా 13వ వార్షికోత్సవం



భోగ్‌బండార్‌లో పాల్గొన్న తండావాసులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని గన్నారం సమీపంలోని ఎత్తుతండాలో జగదాంబ మాత, సేవాభవల్ అలయ 13వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం గజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. తండావాసులు కిషన్ నాయక్ పూజారి, పండితుడు గోపి సమక్షంలో ప్రత్యేక పూజలు, భోగ్‌బండార్ నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా యజ్ఞం, అన్నదాన కార్యక్రమం నిర్వహించి దుర్గామాత, భవానీ మాతకు ఎత్తుతండా అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. పాడిపంటలు, పశువులు సమృద్ధిగా పంటలు పండాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు లక్ష్మణ్, రాములు, చందు, సూర్య, బిక్యామోహన్, రాజు, బలరాం, నందు, గోపాల్, గంగా తోపాటు తదితరులు పాల్గొన్నారు.

విహార యాత్రలో స్మైల్స్ ది స్కూల్ విద్యార్థులు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని స్మైల్స్ ద స్కూల్ చిన్నారులను విహారయాత్రలో భాగంగా బుధవారం గుప్తా టెంపుల్, మునిపల్లిలో ఫీల్డ్ ట్రిప్ సందర్శించారు. కార్యక్రమంలో ఆడుతూ.. పాడుతూ... ప్రీ ప్రైమరీ విద్యార్థులు చక్కగా డాన్సులు చేస్తూ ఎంతో ఆనందంగా గడిపారు. రకరకాల వంటకాలతో అందరూ కలిసి భోజనం చేశారు. కరస్పాండెంట్ రఫీ గోహర్ మాట్లాడుతూ చిన్నారులను పిక్నిక్ తీసుకురావడం వల్ల చిన్నారులందరు ఎంతో సంతోషంగా గడిపారని అన్నారు. విహారయాత్ర వల్ల విద్యార్థుల్లో మానసికంగా వారిలో జ్ఞానాన్ని పెంపొందించవచ్చని ఆత్మస్థైర్యాన్ని నింపవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షబానా గోహర్, ప్రసన్న లక్ష్మి, సవిత, సిందూర, సరిత, స్వప్న, విమల, సింధుజ, రవళి, సంతోషిణి, రోజా, శ్రావణి, చిన్నారులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న నూర్జహాన్

వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. బుధవారం నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్స్‌లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ నర్సింగ్ ఆఫీసర్లను రాష్ట్ర ప్రభుత్వం తొలగించిందన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన పర్మినెంట్ నర్సింగ్ ఆఫీసర్ల స్థానంలో పనిచేసిన వీరిని తొలగించడం అన్యాయమని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖలోని కాంట్రాక్ట్ పద్ధతిలో అందరిని యధావిధిగా కొనసాగించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తెలిపారు. ఐదు సంవత్సరాలు విధులు నిర్వహించిన వీరిని తొలగించడంతో కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులను యధావిధిగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంధ్యారాణి, శకుంతల దివ్య రేవతి శ్రీలత సల్మా తదితరులు పాల్గొన్నారు.

శ్రీ విద్యా సాయి పాఠశాలలో మాతృ భాషా దినోత్సవ వేడుకలు



డ్యాన్సులు చేస్తున్న విద్యార్థినులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని శ్రీ విద్యాసాయి ఉన్నత పాఠశాలలో బుధవారం మాతృ భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. మాతృభాష దినోత్సవం పురస్కరించుకొని పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు మాతృభాష గొప్పదనం గురించి వివరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు దేశ భాష అయిన హిందీతోపాటు వివిధ రాష్ట్రాల మాతృ భాషలో మాట్లాడి అబ్బురపరిచారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను, ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో కరెస్పాండంట్ ఏనుగు గంగారెడ్డి, ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

బదిలీపై వెళ్ళిన ఎంపీడీఓ, టీఏకు సన్మానం



ఎంపీడీవో, టీఏను సన్మానిస్తున్న ఉద్యోగులు

నవతెలంగాణ-ఏర్గట్ల

గతకొన్ని సంవత్సరాలుగా ఏర్గట్ల మండలంలో విధులు నిర్వర్తించి బదిలీపై వేరొక ప్రదేశానికి వెళ్ళిన ఎంపీడీఓ రాజేశంను, టీఏ అరవింద్‌ను తోటి ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో నూతన ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ శివ చరణ్, ఏఓ అబ్దుల్ మాలిక్, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కారోబార్లు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు



పాల్గొన్న హెచ్‌ఎం, ప్రజాప్రతినిధి, తదితరులు

నవతెలంగాణ-బోధన్

మండలంలోని ఎరాజ్ పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు జానపద గేయాలపై నృత్యాలు చేసి అలరించారు. ప్రధానోపాధ్యాయులు అచల మాట్లాడుతూ ఉత్తమ జీపీఏ సాధించి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఉపాధ్యాయులు బోధించిన అంశాలను, క్రమశిక్షణతో ముందుకు సాగాలని తద్వారా జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని సూచించారు. కార్యక్రమంలో ఎంపిటిసి వెంకటేష్ గుప్తా, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏసీపీకి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి నూతన ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన బస్వారెడ్డిని బుధవారం వారి కార్యాలయంలో పట్టణ సామాజిక సేవకులు పట్వారీ తులసి కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను , జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ రక్షణగా నిలవాలని కోరారు. పట్వారి సంఘ సేవకు ఎల్లప్పుడు సహయ సహకారాలు అందిస్తారని ఏసిపి బస్వారెడ్డి అన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఏసీపీకి జ్ఞాపికను అందజేస్తున్న పట్వారి తులసికుమార్

పీఎం విశ్వకర్మ యోజనపై అవగాహన కల్పించాలి



నవతెలంగాణ-లింగంపేట్

సంప్రదాయ చేతి వృత్తులు, హస్త కళాకారులను బలోపేతం చేయడంతో పాటు ఆర్థికంగా చేయూత అందించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఎంపీడీఓ మల్లికార్జున్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పీఎం విశ్వకర్మ యోజన పథకం అవగాహనపై పంచాయతీ కార్యదర్శుల ఏర్పాటుచేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ ఈ పథకం పట్ల గ్రామ, మండల స్థాయిలో చేతి, కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారిలో సామర్థ్యం మెరుగుపరిచి ఉత్పాదకత నాణ్యత, ఉత్పత్తులను పెంచడం ఈ పథకం ఉద్దేశమన్నారు. కులవృత్తులు వంశ పారంపర్యంగా కొనసాగిస్తున్న వారందరినీ విశ్వకర్మలుగా పిలుస్తారని, వీరందరూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపారాల ద్వారా కుల వృత్తులు చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక చేయూత అందించనుందన్నారు.

ఈ పథకానికి ఎంపికైన వారికి రెండు రకాలుగా శిక్షణ ఉంటుందని ప్రాథమిక నైపుణ్యం ద్వారా 5 నుండి 7 రోజులు, అధునాతన నైపుణ్యానికి 15 రోజులు శిక్షణ అందిస్తూ. శిక్షణ అనంతరం15 వేల రూపాయల విలువైన టూల్ కిట్లు, ధ్రువీకరణ పత్రం అందజేస్తామని తెలిపారు. మూడు విడతలుగా లక్ష, రెండు, మూడు లక్షల వరకు రుణం అందజేస్తామన్నారు. మొదటి విడతలో 5 శాతం వడ్డీతో లక్ష రూపాయల రుణం అందజేస్తామని, 18 నెలల్లో చెల్లించాల్సి ఉంటుందని, రెండో విడతలో రూ.2 లక్షలను అందజేస్తామని 36 నెలల వ్యవధిలో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దశల వారీగా గ్రామ మండల ప్రాంతాలలో అర్హులైన అందరికీ లబ్ధిచేకూర్చనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రభాకర్ చారి వివిధ గ్రామాల పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి జాతర



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని ముల్లంగి (బి), బొకన్ పల్లి గ్రామాల శివారులోని వేణుగోపాల స్వామి ఆలయం వద్ద బుదవారం జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని సత్యనారాయణ వ్రతం, కల్యాణం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ విరేందర్ రావు, వైస్ చైర్మన్ సత్యనారాయణ గౌడ్, ప్రమోద్, మహిళలు, చిన్నారులు, యువకులు పాల్గొన్నారు.

చదువుతో ఉజ్వల భవిష్యత్

- జూనియర్, డిగ్రీ కాలేజీల సమస్యలు తీరుస్తా
- జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు

నవతెలంగాణ-మద్నూర్



వీడ్కోలు పార్టీలో పాల్గొన్న ఎమ్మెల్యే

విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలని, చదువు తోనే ఉజ్వల భవి ష్యత్ ఉంటుందని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతరావు సూచించారు. జూనియర్, డిగ్రీ కాలేజీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడానికి ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మద్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వార్షికోత్సవ వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు హాజరు కాగా ఎమ్మెల్యేకు కళాశాల ప్రిన్సిపాల్ కళాశాల లెక్చరర్స్ కళాశాల విద్యార్థులు ఘనంగా సన్మానించారు. జూనియర్, డిగ్రీ కాలేజీల్లో నెలకొన్న సమస్యలను కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఎమ్మెల్యే దృష్టికికి తీసుకురాగా పరిష్కరిస్తానని సభా ముఖంగా హామీ ఇచ్చారు.

కబడ్డీ తుది జట్టు ఎంపిక



ఎంపికైన కబడ్డీ జట్టు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లాస్థాయిలో నిర్వహించిన కబడ్డీ ఎంపికల్లో ప్రాబబుల్స్‌కు సన్నద్ధ శిబిరం నిర్వహించి అనంతరం తుది జట్టు జాబితాను ఖరారు చేశామని జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి ఏ. లింగయ్య బుధవారం తెలిపారు. ఆయన పర్యవేక్షణలో నిర్వహించిన ఎంపికలకు సుమారు 90 మంది పాల్గొన్నారు. ఇందులో ప్రతిభావంతులను ఎంపిక చేసి ఈనెల 23 నుంచి జిల్లా క్రీడా అథారిటీ ప్రాంగణంలో సన్నద్ధ శిబిరం నిర్వహించి తుది జట్టును ఖరారు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివైఎస్ఓ ముత్తేన్న, జిల్లా కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సాయ గౌడ్, గంగాధర్, రాజేందర్, కబడ్డి కోచ్ మీసాల ప్రశాంత్, అనురాధ, సాయిలు, వినోద్ పాల్గొన్నారు.